శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం

రాజుపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని కల్యాణం కన్నులపండువగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి చెన్నకేశవుడు దేవేరులతో కలసి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టీడీపీ నాయకుడు జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జీఎల్ లక్ష్మినారాయణరెడ్డి, ఈవో కేవీ రమణ, టీడీపీ నాయకుడు డి.సుబ్బిరెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యన్నంకిశోర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులు చేతపట్టుకుని మౌన ప్రదర్శనతో నివాళి అర్పిస్తున్న దృశ్యం



వీరజవాన్ ఆత్మకు శాంతి చేకూరాలి

● సీపీఐ, ఏఐబీఎస్‌ఎస్ నేతల మౌనప్రదర్శన

కడప మారుతీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై సాగుతున్న పోరులో శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు పాక్ సైనికులు ఐదుగురిని అంతమొందించి అమరుడైన వీరజవాన్ మూడే మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఐ, ఆలిండియా బంజారా సేవా సంఘ్ (ఏఐబీఎస్‌ఎస్) నేతలు పేర్కొన్నారు. ఆ మేరకు ఏఐబీఎస్‌ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సర్కిల్ సైనిక స్థూపం వద్ద ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన, ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ దాడి చేసినా పాకిస్థాన్ సైనిక ముష్కరులను ఎదుర్కోవడానికి భారత సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటి వేణుగోపాల్, వెంకటశివ, ఏఐబీఎస్‌ఎస్ నేతలు వెంకటస్వామి, అర్జున్, టీఎన్‌ఎస్‌ఎఫ్ తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మన యుద్ధం.. పాకిస్థాన్ ఉగ్రవాదంతో

● భారత సైన్యానికి మద్దతుగా కాగడాల ర్యాలీ

ప్రొద్దుటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం సాగిస్తున్న యుద్ధం పాకిస్థాన్ ప్రజలతో కాదని అక్కడి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదంతో అని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారత సైన్యానికి నైతిక మద్దతుగా ప్రొద్దుటూరులోని గాంధీ విగ్రహం వద్దనుంచి శివాలయం సర్కిల్ వరకు భారీ కాగడాల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ యుద్ధం వలన పాకిస్థాన్ తీవ్రంగా నష్టపోతుందని.. అలాగే భారతదేశానికి కూడా ఆర్థికంగా ఒడిదుడుకులు ఏర్పడతాయని అన్నారు. అందువల్ల ఈ యుద్ధం త్వరగా ముగిసిపోవాలని కోరుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల లక్ష్యంగానే భారత సైన్యం దాడులు సాగుతున్నాయన్నారు. మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ మన పోరాటం మతంతో కాదని ఉగ్రవాదంతో అన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భారత్ మాతాకి జై.. హిందూస్థాన్ జిందాబాద్.. పాకిస్థాన్ డౌన్‌డౌన్.. జైజవాన్ జైహింద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు కామిశెట్టి బాబు, జబివుల్లా, కౌన్సిలర్లు, టీడీపీ, బీజేపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి దందా



● జిల్లాలో సాగుతున్న జాతీయ రహదారి పనులు
● మట్టి కోసం రైతుల నుంచి ఎకరా రూ.30వేలకు కొనుగోలు
● రూ.3లక్షలకు విక్రయించిన వైనం
● మీటర్లకు మీటర్లు తవ్వుతున్న సబ్‌కాంట్రాక్టర్లు
● చెరువులనూ కొల్లగొడుతున్న వైనం



బి.కోడూరు మండలం మున్నెల్లి చెరువులో అడ్డగోలుగా ఎక్సకవేటర్‌తో తవ్వకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి జిల్లాలోని పులివెందుల, మైదుకూరు. బద్వేలు మీదుగా నెల్లూరు జిల్లాలోకి వెళుతుంది. ప్రస్తుతం జిల్లాలో జాతీయ రహదారి పనులు సాగుతున్నాయి. ఈ రహదారి పనులను ప్రముఖ సంస్థ దక్కించుకుంది. ఆ సంస్థ నుంచి కొందరు సబ్ కాంట్రాక్టులు తీసుకుని పనులు చేస్తున్నారు. కాశినాయన మండలంలోని వంకమర్రి సమీపంలో నుంచి బి.కోడూరు మండలంలోని టమటంవారిపల్లె, గోవిందాయపల్లె, రాజపాలెం, పేరమ్మగారిపల్లె, దంతలపల్లె మీదుగా.. పోరుమామిళ్ల మండలం నుంచి నెల్లూరు జిల్లాలోకి ఈ జాతీయ రహదారి వెళుతుంది. రోడ్డు నిర్మాణానికి పెద్దఎత్తున మట్టి, గ్రావెల్ అవసరం. ఇప్పటికే బి.మఠంలో అడ్డగోలుగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బి.కోడూరు మండలంలో ఓ నేత మున్నెల్లి రెవెన్యూ పొలంలో సుమారు 40 ఎకరాల భూమిని ఎకరా రూ.30వేల చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేసి సబ్ కాంట్రాక్టర్లకు రూ.3లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడని అంటున్నారు. ఈ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్నారు. పొలాల్లో భారీగా మట్టి తవ్వేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డంతో చెరువును తలపించే విధంగా తయారయ్యాయి. సదరు నేత నేనున్నానంటూ భరోసా ఇవ్వడంతో అడ్డగోలుగా మట్టి తవ్వుతున్నారని చెబుతున్నారు.



రైతుల పొలాల్లో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

చెరువులోనూ ఇష్టారాజ్యం..

మున్నెల్లి చెరువులో అయితే ఎక్సకవేటర్లు పెట్టి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేస్తున్నారు. నిబంధనల ప్రకారం మీటరు మేరకు తవ్వకాలు జరుపుకోవచ్చు. అయితే ఇక్కడ సుమారు 15 నుంచి 20 అడుగుల లోతు తవ్వుతున్నారు. అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వుతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరద్ధంగా తవ్వుతున్న విషయాన్ని తహశీల్దారు దస్తగిరి దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై విచారిస్తామన్నారు. అలాగే చెరువుల తవ్వకంపై ఇరిగేషన్ డీఈ వేణుగోపాలరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అసలు మట్టి తవ్వకానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని అన్నారు.

జిల్లాలో చేపట్టిన బెంగళూరు- విజయవాడ జాతీయ రహదారి నిర్మాణం కొందరు నేతలకు బాగా కలిసి వచ్చింది. మా అడ్డాలో పని చేస్తున్నారు, మాకు పర్సంటేజీ ఇవ్వాలి అంటూ అడ్డుకోవడంతో కొద్దిరోజుల పాటు రోడ్డుపని నిలిచి పోయింది. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు దృష్టికి వెళ్లడంతో జాతీయ రహదారి పనులను అడ్డుకుంటే సహించేది లేదంటూ ఆయన హెచ్చరించారు. దీంతో కీలక నేతలు సైలెంట్ అయిపోగా.. ద్వితీయ శ్రేణి నాయకత్వం ఈ రోడ్డు మాటున బాగా వెనకేసుకుంటున్నారని చెబుతున్నారు.

మేయరు సురేశ్‌బాబుకు నోటీసులు

● 13న పీఎస్ ముందు హాజరు కావాలని ఆదేశం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప మేయరు సురేశ్‌బాబును ఈ నెల 13వ తేదీన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎదుట హాజరు కావాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. కడప కార్పొరేషన్‌లో మేయరు సురేశ్‌బాబు భార్య జయశ్రీ, కుమారుడు అమరేశ్‌లు వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరిట కాంట్రాక్టులో రిజిస్టరు చేసుకున్నారు. పక్కీరుపల్లె, శ్రీనగర్‌కాలనీలో రోడ్ల నిర్మాణం, మినీ బైపాస్ వద్ద కాల్వ రివిట్‌మెంటు పనులు చేపట్టారు. మరో పనికి అగ్రిమెంటు చేయించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారంటూ టీడీపీ నేతలు మేయరుపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది. విచారణలో నాలుగు పనులు పూర్తి చేసినట్లు గుర్తించారు. మేయరు కుటుంబ సభ్యులు పనులు చేయడం నిబంధనలకు విరుద్ధం. నిబంధనలు ఉల్లంఘించిన మీపై ఎందుకు అనర్హత వేటు వేయకూడదో చెప్పాలంటూ ప్రభుత్వం మార్చి 23వ తేదీన నోటీసులు జారీ చేసి రెండు వారాలు గడువు ఇచ్చింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు రెండువారాలు స్టే ఇచ్చింది. అయితే మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎదుట హాజరై మీ వాదన చెప్పుకోవాలని కోర్టు సూచించింది. దీంతో పీఎస్ ముందు ఈ నెల 13న హాజరు కావాల్సిందిగా ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ విషయమై ఆంధ్రజ్యోతి మేయరు సురేశ్‌బాబును వివరణ కోరగా.. తనకు ఇంకా నోటీసు అందలేదన్నారు. నోటీసు వస్తే హాజరై సంజాయిషీ ఇచ్చుకుంటానని వెల్లడించారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలలో మొత్తం 47,000 మంది విద్యార్థులు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారన్నారు. ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయంలోగా పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. ఇంటర్ ప్రశ్నాపత్రాలను భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించామని తెలిపారు. పరీక్షలు జరిగే రోజు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, మొబైల్ ఫోన్స్ అనుమతించమని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జామ్ ఈసీ మెంబర్లు, కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఆర్‌ఐఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



కనుమ పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, మే 9 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మహాప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఐదురోజుల నుంచి ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగాయని, మహాప్రసాదం వినియోగంతో 332వ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ముగిశాయని ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపా తెలిపారు. కాగా.. గురుపూజ మహోత్సవాల ముగింపులో భాగంగా దేవస్థాన పరిధిలో ఉన్న కనుమపోలేరమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.47లక్షలు

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా హుండీల ద్వారా రూ.47లక్షల ఆదాయం వచ్చింది. శుక్రవారం దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఏడు శాశ్వత హుండీలు, నాలుగు తాత్కాలిక హుండీలను పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్, ఫిట్ పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో లెక్కించారు. రూ.47,26,627ల నగదు, 8 గ్రాముల బంగారు, 530 గ్రాముల వెండిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు దేవదాయశాఖ అధికారి జనార్ధన్, ఇన్‌స్పెక్టరు శివయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ డీడీగా రెడ్డయ్య



కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ డీడీగా నెల్లూరు రెడ్డయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా పాతకడప చెరువు ఆక్రమణ విషయంలో మత్స్యశాఖ అధికారుల పాత్రపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారులకు ప్రయోజనం కలిగించేలా మత్స్యశాఖ కార్యాలయంలో నుంచి దారి కల్పించారని వచ్చిన ఆరోపణలపై ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మత్స్యశాఖ డీడీ శ్యామలమ్మ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. ఆ మేరకు అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేస్తున్న నెల్లూరు రెడ్డయ్యకు మత్స్యశాఖ డీడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలి

● వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న అన్ని పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, జరిగే పరిశోధనలు, నాణ్యమైన విద్యాబోధన గురించి అందరికీ తెలిసేలా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో అన్ని శాఖల హెచ్‌ఓడీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్‌నకు దరఖాస్తు చేసుకున్న, చేసుకోబోతున్న విద్యార్థుల వివరాలు తెలుసుకుని వారికి విశ్వవిద్యాలయంలో లభించే నాణ్యమైన బోధన, సహ పాఠ్యేతర కార్యక్రమాల గురించి తెలియజేసి వారు ఇక్కడే చేరేలా చూడాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న పరీక్ష కేద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, డీన్‌లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

మత్తు వదలరా..?

● జైలుకెళుతున్నా.. ఆగని మందుబాబుల జోరు ● మూడు నెలల్లో 290 కేసులు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు పోలీసులు మత్తు వదిలిస్తున్నారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకునేందుకు పోలీసులు రాత్రివేళల్లో బ్రీత్ ఎనలైజరుతో తనిఖీలు చేపడతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న వారిని కోర్టుకు హాజరుపరిచి జైలుకు పంపుతున్నా కొందరి తీరు మారడం లేదు.

కడప క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు విభాగం ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించి సూచనలు చేస్తున్నా, హెచ్చరిస్తున్నా మందుబాబులు మద్యం తాగి వాహనాలు నడపడం మానడం లేదు. ఇలాంటి వారిపై కడప పరిధిలో ఈ మూడు నెలల్లో 290 కేసులు నమోదు చేశారు. కేసు నమోదు చేయడంతో పాటు జడ్జి ఎదుట హాజరు పరచడంతో వారు తాగిన మోతాదును బట్టి రూ.3,500 నుంచి రూ.10వేల వరకు జరిమానా.. వారం నుంచి నెలరోజుల వరకు జైలుశిక్ష విధిస్తున్నారు.

జైలుకు పోయినా..

మద్యం తాగి పట్టుబడి జరిమానాలతో పాటు జైలుకు వెళ్లినా కొందరిలో మార్పు రావడంలేదు. మద్యం దుకాణాల వద్ద, బార్ల వద్ద ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో కనిపిస్తుంటాయి. మద్యం సేవించి నేరుగా ఇళ్లకు వాహనాల్లోనే వెళుతున్నారు. పోలీసులు కూడా అన్ని స్టేషన్ల పరిధిలో గట్టి నిఘా ఉంచి డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఒకసారి జైలుకు పోయి వచ్చినా మళ్లీ మద్యం తాగి వాహనాలు నడుపుతూ కనిపిస్తున్నారు.

నగరంతో పాటు..

నగర శివార్లలోని రింగు రోడ్డుపై రాత్రి వేళ పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఓవర్ స్పీడ్‌తో పాటు డ్రెంకెన్ డ్రైవ్‌పై దృష్టిసారించారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు వారంరోజుల నుంచి పోలీసులు గస్తీ ముమ్మరం చేయడంతో పాటు నగర శివార్లలోని ప్రధాన సర్కిళ్లలో బ్రీత్ ఎనలైజరుతో తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలే కాక కార్లు, లారీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎవరైనా మద్యం తాగి పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి జరిమానా జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు. అయినా మందుబాబుల్లో మార్పు రాకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు కోరుతున్నారు.

లైసెన్సు క్యాన్సిల్ చేయిస్తాం..



రాత్రివేళ బ్రీత్ ఎనలైజరుతో తనిఖీలు చేపడుతున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. మొదటిసారి పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా, జైలుశిక్ష పడుతుంది. రెండోసారి పట్టుబడితే వారి లైసెన్సు రద్దు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. పగలు రాత్రి తేడా లేకుండా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపడతాం.

- జావీద్, ట్రాఫిక్ సీఐ, కడప

రైతుల బాగు కోసమే రీసర్వే

● ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తరువాత చేయిస్తున్న రీసర్వే భవిష్యత్తులో రైతుకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. మండలంలోని బయనపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న రెండో దశ రీసర్వేను ఆర్డీవో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు బాగుపడేందుకే రీసర్వే చేయించడం జరుగుతుందని ఇందులో భూముల హద్దులు, విస్తీర్ణం, వంటివి రైతులకు రికార్డుపరంగా తెలియజెప్పి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, ఆర్‌ఐ కౌశిక్, డీటీ సర్వే అర్చన, సర్వేయరు ఖాజాహుస్సేన్, వీఆర్వోలు లక్ష్మీవినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ కట్ : డీపీవో



సూచనలిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లించేవారంతా సకాలంలో చెల్లించాలని లేకుంటే వారి ఇళ్లకు సంబంధించిన కొళాయి కనెక్షన్లు కట్ చేస్తామని డీపీవో రాజ్యలక్ష్మి అన్నారు. చెన్నూరు గ్రామ పంచాయతీకి శుక్రవారం వచ్చిన ఆమె గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు ఏ మేరకు వసూలు అయ్యాయి, ఇంకా ఎంత బాకీ ఉన్నారు, మొండిబకాయిలు వంటి వాటిపై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిని ప్రశ్నించడం జరిగింది. అలాగే పన్నులు సకాలంలో చెల్లించేందుకు గ్రామ పంచాయతీ అంతా వీధివీధినా టాంటాం వేయించాలన్నారు. అలాగే సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చి అడగాలన్నారు. కాకపోతే పన్నులు చెల్లించకుండా మొండికేస్తే వారి ఇంటి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని సూచించారు. అలాగే ఇకపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చెన్నూరు గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీని చూసి అక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయించి ఆ నిధులు పంచాయతీ అభివృద్ధికి వాడుకోవాలన్నారు. అలాగే శివాలపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని చూడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో అన్నీ స్కాములే'



మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో స్కీములు ఒకటి కూడా కనబడటం లేదు గానీ స్కాములు మాత్రం దండిగా ఉన్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఒకటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించడం అన్యాయమన్నారు. లేని లిక్కర్ స్కాములు బయటకు తీసి అబద్ధాల ఆరోపణలుగా కేసులు పెడుతున్నారని చెప్పారు. అధికారులను నాయకులు ఇరికించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందని తెలిపారు.

చెత్త తొలగించరు..మురుగు పారదు..!

కేసీ కాల్వలో పేరుకుపోయిన చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలు



విద్యుత్‌నగర్ కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

కడప క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పుష్పగిరి స్కూలు నుంచి ఉన్న కేసీ కెనాల్ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఈ కాల్వలో మురుగునీరు పారుతున్నప్పటికీ ఈ వ్యర్థాల కారణంగా నీరంతా నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని చోట్ల కాల్వ ఆక్రమణలకు గురికావడం, కాల్వ ఇరువైపులా రోడ్డు కూడా సరిలేకపోవడంతో ఎవరూ కూడా చెత్త తొలగించే సాహసం చేయడంలేదు. ఏళ్ల తరబడి ప్లాస్టిక్ వస్తువులు ఉన్నా వాటిని తొలగించిన పాపాన పోలేదు. ఈ కాల్వ పుష్పగిరి స్కూలు నుంచి నెహ్రూనగర్, విద్యుత్ నగర్, కొండాయపల్లె మీదుగా పాతకడప వరకు ఉంది. అయితే కాల్వలో చెత్త ఎత్తకపోవడంతో కాల్వ నిండా పిచ్చి మొక్కలు, తీగ ఆకులతో నిండిపోయింది. ఇక కాల్వ సమీపం లో ఉన్న నివాసగృహాలు ఈ దుర్వాసనతో పాటు దోమల బెడదతో స్థానికులు అల్లాడిపోతున్నారు.

ఇక వర్షాకాలం వచ్చిందంటే ఆ కాల్వ మరీ అధ్వానంగా తయారవుతుంది. వర్షాలు వచ్చినప్పుడు తూ.తూ మంత్రంగా పనులు చేస్తూ వదిలేస్తారు. వేసవికాలంలో నుంచి చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి కాల్వలో మురుగునీరు పారేలా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప,కలెక్టరేట్,మే9,(ఆంధ్రజ్యోతి) : కడప మెడికల్ రీజనల్ కార్యాలయం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కడప మెడికల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు ఎన్జీవో సంఘ నేతలు శుక్రవారం పాత రిమ్స్‌లోని ఆర్డీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ మాట్లాడుతూ అన్ని క్యాడర్స్ పీహెచ్‌ఎన్, ఎంపీహెచ్‌ఈవో, ఫార్మసీ సూపర్‌వైజరు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ వైద్యశాఖ ఉద్యోగుల సీనియార్టీ జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, మాధవ్, డి. చంద్రమోహన్, జిల్లా మహిళా కన్వీనరు జమీలా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాలేటి గంగమ్మ తిరునాళ్లు



కమలాపురం రూరల్, మే 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని టి.చది పిరాళ్ల, గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసి ఉన్న శ్రీపాలేటి గంగమ్మ (మంచాలమ్మ) తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ 18వ వార్షికోత్సవ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. చదిపిరాళ్ల, గొల్లపల్లె గ్రామాలతో పాటు మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే గొల్లపల్లె చదిపిరాళ్ల గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

రేపటి సంకల్ప సభను దిగ్విజయం చేయండి

కడప మారుతీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నగర ఇంజనీర్స్ భవన్‌లో బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన బీఎస్పీ సంకల్ప సభను దిగ్విజయం చేయాలని బహుజనసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సామవేశంలో ఆయన మాట్లాడారు.

రామన్నూతలపల్లె వ్యక్తికి పాకిస్థాన్ నుంచి ఫోన్‌కాల్

లింగాల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నూతలపల్లె గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి అనే వ్యక్తికి శుక్రవారం పాకిస్థాన్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఫోన్‌కాల్ గురించి వెంటనే సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. భారత్, పాక్ యుద్ధం నేపథ్యంలో ఫోన్ కాల్ ప్రాధాన్యం సంతరించుకుంది.

అసంబద్ధ విధానాలను ఉపసంహరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో అసంబద్ధ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్ సుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకు వస్తున్న సంస్కరణల విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు నెలకొల్పితే ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఒక్కో పాఠశాలకు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోం దన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కోరకమైన విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, మునివర్ధన్‌కుమార్, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, సుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథరెడ్డి, సి.కె.శ్రీనివాసరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవుల జయంతులు నిర్వహించాలి : ఆచార్య మూల

కడప కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమ కవులు, కళాకారుల జయంతులు నిర్వహించాలని యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండల సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం వైవీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావును కలిసి ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడారు.సీమలో సాహిత్య కేంద్రంగా వెలుగొందుతున్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వారి జయంతులు నిర్వహించవలసిన అవసరముందన్నారు. ఇందుకు ఉపకులపతి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో గ్రంథాలయంలో ఇలాంటి సాహిత్య సంబంధమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

నేడు చెన్నూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చెన్నూరులో మూడో శనివారం సందర్భంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు.వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధుల కొరత లేదు

వేంపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు నిధుల కొరత ఏమాత్రం లేదని, ఈ వేసవిలో ఇప్పటి వరకు రూ.3కోట్ల దాకా ఖర్చుచేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏడుకొండలు తెలిపారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈఓ రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ కుళాయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ నీటి సరఫరా సిబ్బందితో మాట్లాడారు. వేంపల్లెలోని తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా చర్చించి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అదనంగా బోర్లు వేయాలని నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు.

వీరజవాన్‌కు ఘన నివాళులు



మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న నల్లపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు

పులివెందుల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన మురళినాయక్‌కు పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం రాత్రి నల్లపురెడ్డిపల్లె గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళినాయక్ మృతిని దేశం ఎన్నటికి మరువదని నినదించారు.

'1000 సంవత్సరాలు ఉగ్రవాదం అనే మాట వినపడకూడదు'

కడప ఎర్రముక్కపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో వీరోచితంగా, విజయవంతంగా మన దేశ సైనికులు పోరాడుతున్నారని ఆడిటర్ ఎస్వీ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యావత్ భారత దేశం మన వీర సైనికుల వెంట ఉన్నారని తెలిపారు. 1000 సంవత్సరాలు ఉగ్రవాదం అనే మాట ప్రపంచ దేశాలలో కూడా వినపడకుండా చేయాలని తెలిపారు.

వీరజవాన్ మురళీనాయక్ పోరాట స్ఫూర్తి ఆదర్శం

కడప నాగరాజుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో జరి గిన యుద్ధంలో అసువులు బాసిన జవాన్ మురళి నాయక్ నేటి యువతరానికి ఆదర్శనీయమని గిరిజన సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. శుక్రవారం కడపలోని తారకరామనగర్‌లో జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఎన్నికలు సజావుగా జరిపించండి

కడప కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఎన్నికలను సజావుగా జరిపించాలని ఆ చర్చి మాజీ కార్యదర్శి శామ్యూల్‌బాబు జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో సీఎస్ఐకి చెందిన రెండు చర్చిలు ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలు సజావుగా జరగడంలేదని ఆరోపించారు. 50 సంవత్సరాలుగా ఆ ఎన్నికల్లో తమకు ఓటు హక్కు ఉందని, త్వరలో జరిగే ఆ ఎన్నికల్లో తమకు ఓటు హక్కు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆ చర్చిలకు సంబంధించిన నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ



వేంపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న కార్మికులు

వేంపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెను శుక్రవారం మధ్యాహ్నం విరమించారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, గురువారం ఉదయం నుంచి పనులు నిలిపివేసిన విషయం తెలిసిందే. సర్పంచు ఆర్.శ్రీను, ఈఓ రామసుబ్బారెడ్డి కలిసి రెండు నెలల వేతనం ఇస్తామని పారిశుధ్య సిబ్బందికి తెలిపారు. పూర్తిస్థాయిలో వేతనాలు కావాలని సమ్మెను కొనసాగించారు. శుక్రవారం మరోమారు ఈఓ రామసుబ్బారెడ్డి, టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి పారిశుధ్య కార్మికులతో చర్చించారు. నెలాఖరులోగా ఐదునెలల వేతనం ఇస్తామని ఈఓ తెలిపారు. అలాగే ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇస్తామని తెలపడంతో అంగీకరించి సమ్మెను విరమించారు. అడ్వాన్స్‌కు సంబంధించిన రూ.10వేలు శుక్రవారం సాయంత్రం ఇచ్చేందుకు ఈఓ సిద్ధం కాగా, పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు కూడా రూ.10వేలు ఇవ్వాలని, లేకుంటే ఎవరం అడ్వాన్స్‌లు తీసుకోబోమని కార్మికులు స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు,మూడు రోజుల్లో అందరికీ అడ్వాన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఈఓ తెలపడంతో కార్మికులు అంగీకరించారు.

అధికారులూ... కనిపించలేదా..?

డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ కడప సర్కిల్ కార్యాలయం

అది నగర మారుతీనగర్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ కడప సర్కిల్ కార్యాలయం. సెలవుదినాలలో తప్ప మిగతా పనిచేసే రోజులలో ఆ కార్యాలయ సిబ్బందితో పాటుగా సంబంధిత అధికారి వివిధ వాహనాలలో కార్యాలయం లోకి విధులు నిర్వహించే క్రమంలో రాక పోకలు సాగిస్తుంటారు. ఆ కార్యాలయ ముఖ ద్వారం వద్ద డంపింగ్ యార్డును తలపించేలా చెత్తా, చెదారం వేస్ట్ పేపర్స్‌తో పాటుగా ఎండిపోయిన ఆకులు గుట్టగా పడి ఉన్నాయి. నిత్యం నగర పరిశుభ్రత గురించి తపన పడే కడప కార్పొరేషన్ కమిషనర్ క్యాంపు ఆఫీస్ కూడా ఆ ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి అత్యంత సమీపంలోనే వుంది. అయినప్పటికీ అక్కడ పెద్ద చెత్తకుప్ప వున్నప్పటికీ దాన్ని తొలగించాలనే ఆలోచన, ధ్యాస ఆయా కార్యాలయాల సిబ్బందికి, లేకపోవడం విచారకరం.

కడప మారుతీనగర్ (ఆంధ్రజ్యోతి)




ముద్దనూరు-పులివెందుల మధ్య సాగుతున్న సర్వే పనులు

ఎట్టకేలకు నేషనల్ హైవే సర్వే పనులు ప్రారంభం

- జూన్‌లో రోడ్డు పనులు ప్రారంభమయ్యే అవకాశం
- ఇప్పటికే మొదలైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-బి.కొత్తపల్లె నేషనల్ హైవే పనులు ఎట్టకేలకు ప్రారంభంకానున్నాయి. ఈ రోడ్డు పనులకు సంబంధించి తుది దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో నాలుగు వరుసల నేషనల్ హైవే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డు పనుల ప్రారంభానికి అవసరమైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే ....

ముద్దనూరు-హిందూపురం వరకు నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 156 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో దాదాపు రూ.1500 కోట్లతో మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో మొదటి ప్యాకేజీ కింద ముద్దనూరు నుంచి బండమీద కొత్తపల్లె (బి.కొత్తపల్లె), రెండో ప్యాకేజీ బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు, మూడో ప్యాకేజీ కింద గోరంట్ల నుంచి హిందూపురం వరకు పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయంచింది. గత ప్రభుత్వంలో మొదటి, మూడో ప్యాకేజీ టెండర్ దశలోనే ఆగిపోయాయి. కానీ రెండో ప్యాకేజీ మాత్రం బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు పనులు ప్రారంభమై దాదాపు 50 నుంచి 60శాతం పూర్తయ్యాయి. ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె (బండమీద కొత్తపల్లె) మొదటి ప్యాకేజీ ఇప్పటికే పలుమార్లు టెండర్ దశలోనే పనులు ఆగిపోయాయి. ఈ కారణంగా ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న రెండు వరుసల రహదారి రోడ్డు నిర్మాణం కాక అధ్వాన్నస్థితికి చేరుకుంది. ఈ దశలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మొదటి ప్యాకేజీ అయిన ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి టెండర్ పూర్తయింది. ఓ ప్రైవేటు సంస్థ రూ.860 కోట్లకు 43శాతం లెస్‌తో రూ.484కోట్లకు టెండర్ దక్కించుకుంది. అంటే ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న 56 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి రూ.484కోట్లతో పనులు చేపట్టనుంది. ప్రస్తుతం టెండర్ దశ పూర్తిచేసుకొని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునే పనిలో సంస్థ ఉన్నట్లు తెలిసింది. నాలుగైదు రోజుల్లో ఒప్పందం కూడా పూర్తికానున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి సంబంధించి చివరి దశ సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే ఈ రహదారి వెంబడి ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ముద్దనూరు-పులివెందుల మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే నేషనల్ హైవేకి సంబంధించిన పనులు ప్రారంభమయినట్లే అని ఆ అధికారి ధ్రువీకరించారు. కానీ ప్రభుత్వంతో కాంట్రాక్టు సంస్థకు ఒప్పందం పూర్తయిన అనంతరం కాంట్రాక్టు సంస్థ పనులు చేసేందుకు క్రషర్లను ఏర్పాటు చేయడం, యంత్రాలను ఇక్కడకు తేవడం తదితర పనులు పూర్తయిన తర్వాతనే నేషనల్ హైవే పనులు ప్రారంభమైనట్లు ప్రకటిస్తామన్నారు. రోడ్డు పనులు ప్రారంభానికి ముందు విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ తదితర పనులు చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే విద్యుత్ లైన్‌ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం విద్యుత్‌లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నా రోడ్డు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారి పేర్కొన్నారు.


తొండూరు-పులివెందుల మధ్య విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు

గాలివానకు నేలకొరిగిన మామిడిచెట్లు

- రూ.15 లక్షలు నష్టం
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



ఎర్రగుడి గ్రామంలో నేలకొరిగిన మామిడిచెట్లను పరిశీలిస్తున్న అధికారులు, పదేళ్ల మామిడిచెట్టు నేలకొరిగిందని చూపుతున్న రైతు

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన గాలివానకు మామిడితోటలు భారీగా దెబ్బతిన్నాయి. అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ రమణలు శుక్రవారం మామిడితోటలను పరిశీలించారు. మండలంలోని ఎర్రగుడి, రాచుపల్లె, కల్లూరుపల్లెలలో గురువారం రాత్రి వర్షంతో పాటు పెనుగాలులు వీచడంతో దాదాపు 150 మామిడిచెట్లు నేలకొరిగి కాయలు రాలిపోయాయి. దాదాపు రూ.15లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. అయితే పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. మామిడి తోటలకు బీమా కట్టామని, కనీసం బీమా వస్తే కాస్త ఉపశమనం కలుగుతుందని రైతులు సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి, నాయక్, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


డ్రైడే-ఫ్రైడే ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులను అదుపు చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అదుపునకు, దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమవంతు పాటుపడాలన్నారు. ఇళ్లలోని నీటిపాత్రలు, కుండలు, బానలు వారానికి ఒకసారి శుభ్రంగా కడిగి ఆరబెట్టాలన్నారు. మురికిగుంతల్లో చెత్తా చెదారం వేయవద్దన్నారు. కాలువల్లో పేరుకు పోయి నీటి నిల్వలు పెరగడంతో దోమల కారకమైన లార్వా పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మెడికల్ ఆఫీసరు డాక్టర్ హైమావతి, అసిస్టెంట్ మలేరియా అధి కారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసరు నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె మండలం పోతబోలు హరిజనవాడ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఎస్.గణపతి భార్య నరసమ్మను శుక్రవారం అదుపులోకి తీసుకుని 35 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ చెప్పారు. కురబలకోట మండలం తెట్టు గ్రామం వద్ద యు.అమరనాథ్‌ను అరెస్టు చేసి అతని నుంచి 25 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఇద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ దాడుల్లో కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, సీఐ నాగేంద్రమ్మ, ఎస్ఐలు జబీవుల్లా, సతీష్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ, పృథ్వీ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


రామిరెడ్డి మృతదేహం

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మూలి రామిరెడ్డి (63) మృతి చెందగా.. కొండారెడ్డి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.... కుప్పం గ్రామం ఉప్పలవాండ్లపల్లె (బురుజుపల్లె కాలనీ) నివాసి రామిరెడ్డి, వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన కొండారెడ్డిలు బంధువులు. వారు వేంపల్లెలో పెళ్లి చూసుకొని అనంతరం చక్రాయపేటకు బైకులో వస్తుండగా మారెళ్ల మడక గ్రామ సమీపాన అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నా రు. దీంతో వాహనం నడుపుతున్న కొండారెడ్డికి తీవ్ర గాయాలు కాగా, వెనుక కూర్చున్న రామిరెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాయలకుంట్ల గ్రామంలో చోరీ

- రూ.60 వేలు నగదు అపహరణ


బీరువాలోని వస్తువులను చెల్లాచెదరుగా పడేసిన దృశ్యం

బి.కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో గురువారం రాత్రి తాతిబోయిన ఓబులేసు ఇంటిలో చోరీ జరిగింది. ఓబులేసు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి బద్వేలుకు పెళ్లికి వెళ్లారు. గమనించిన దొంగలు రాత్రికి ఆ ఇంటిలో చొరబడి బీరువాను పగలగొట్టి రూ.60వేలు చోరీకి పాల్పడ్డారు. తమ కుమారుడు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా.. ఫీజు కట్టేందుకు పత్తి డబ్బులు రూ.60వేలు తీసుకువచ్చి ఇంటిలో పెట్టుకున్నామని.. ఆ డబ్బులు చోరీ చేశారని బాధితుడు వాపోయారు. ఈమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసురేశ్ తెలిపారు.

కరెంటు వైర్లు తగిలి బేల్దారి మృతి

కడప క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పులివెందుల రోడ్డులోని మెడికల్ కళాశాల వద్ద బేల్దారి పనిచేసుకుంటున్న వ్యక్తికి కరెంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... రామరాజుపల్లెకు చెందిన నీలం ఓబులేసు (35) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం వైద్యకళాశాల వద్ద బేల్దారి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కరంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి...



లింగాల, మే 9 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం చెరువులోకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు.... కదిరి మండలం చెలంకూరు గ్రామానికి చెందిన యల్లనూరు హజరతయ్య అనే వ్యక్తి బేల్దారి పనికోసం లింగాల మండలంలోని కామసముద్రం గ్రామానికి వచ్చాడు. అయితే శుక్రవారం పనిలేక పోవడంతో చేపల కోసం చెరువు దగ్గరకు వెళ్లాడు. ప్రమాదవాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని దివ్యాంగుడి ఆత్మహత్య


సాముల ప్రతాప్ మృతదేహం

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణానికి చెందిన సాముల ప్రతాప్ (32) అనే మూగవ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ... పట్టణంలోని పురుషోత్తంరెడ్డి కాలనీకి చెందిన సాముల ప్రతాప్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరి వేసుకున్నాడు. అతనికి భార్య ధనలక్ష్మి(మూగవారే), నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రతాప్‌తో పాటు ఇటీవల కుమారుడికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. దీనికితోడు అతనికి ఉన్న ఒకే ఒక్క స్నేహితుడు ఇటీవల చనిపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప వీఅండ్ఎస్‌వో సస్పెన్షన్

కడప (మారుతీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న ముజుబర్ రెహమాన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ మేరకు ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై గతంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో పాటు పలువురు ఉద్యోగుల వద్ద మామూళ్లు వసూళ్లు చేశారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పైస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. అందులో నిజాలు నిగ్గు తేలడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. యువకుడి మృతి


మృతిచెందిన ప్రభుదాస్ (ఫైల్)

నందలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప- చెన్నై ప్రధాన రహదారి నందలూరు బాహుదానది వంతెన సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, మోపెడ్(టీవీఎస్ ఎక్స్ఎల్) ఢీకొన్న సంఘటనలో గురునాథం ప్రభుదాస్ (22) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాజంపేట మండలం బోయనపల్లె ప్రాంతానికి చెందిన ప్రభుదాస్ నందలూరులోని తమ బంధువుల వద్దకు వచ్చి తిరిగి రాజంపేటకు వెళుతున్న సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాల పాలైన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రభుదాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన వెంగముని

పులివెందుల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె క్రాస్ రోడ్డు ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన పసలపాటి వెంగముని (38) అనే వ్యక్తి తన మోటార్ సైకిల్లో పులివెందుల నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. అయితే వాహనం అదుపు తప్పి కింద పడ్డాడా లేక గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా అనే విషయం తెలియరాలేదని పోలీసులు తెలిపారు.


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రైల్వేస్టేషన్, బస్సుల్లో విస్తృత తనిఖీలు

ఎర్రగుంట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్పీ ఆదేశాల మేరకు ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్, ప్రైవేటు ట్రావెలింగ్ బస్సుల్లో ఎర్రగుంట్ల పోలీసులు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్ పీఎఫ్ పోలీసులు గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అనుమానితులు, అపరి చితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల బ్యాగులను తనిఖీలు చేశారు. ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడళ్లలో సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాల డిక్కీలను తెరచి బ్యాగులను పరిశీలించారు. కొందరి సెల్‌ఫోన్లను పోలీసులు తనిఖీ చేశారు.


ఆలయ ఈవోకు చెక్కును అందజేస్తున్న మండిపల్లి రాహుల్‌రెడ్డి దంపతులు

శాశ్వత అన్నదానానికి రూ.1,11,116 విరాళం

రాయచోటిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శాశ్వత అన్నదానానికి మండిపల్లి రాహుల్‌రెడ్డి, మైత్రేయి దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు. వీరు తన కుమారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నారాయణరెడ్డి మనవడు అయిన మండిపల్లి కుశాల్‌రెడ్డి పేరు మీద శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ ఈవో డీవీ రమణారెడ్డికి చెక్కు రూపంలో ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణయ్య, శంకరయ్య స్వాములు వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికా వికాసం.. భవితకు సోపానం

- కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో,సూపర్‌వైజర్లు
- జిల్లా వ్యాప్తంగా బాలికలకు వేసవి శిక్షణ



ప్రొద్దుటూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పసిప్రాయంలో లైంగిక వేధింపులు... ముక్కుపచ్చలారని చిన్నారికి మూడుముళ్లు.. ప్రేమపేరుతో వంచన.. ఏం చేయాలో తెలియక బాల్యం తల్లడిల్లుతోంది, వారిలో చైతన్యం తెచ్చే దిశగా బాలికల రక్షణ, వారి అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా కిశోర బాలిక వికాసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కార్యక్రమం మరుగున పడింది. కూటమి సర్కార్ దీన్ని పునఃప్రారంభించింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసం సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

'పరిచయం'తో మొదలు

సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మస్థైర్యం పెంపొందించ డమే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తారు. మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూన్ 10 వరకు నిర్వహించే కార్యక్రమాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలి రోజు బాలికలకు పరిచయం ఏర్పాటు చేశారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సుగల కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించి పలు అంశాలపైన శిక్షణ ఇస్తారు. 12 అంశాలపై కలిగించే అవగాహనలో ముందుగా దీనిపై అంగన్వాడీ, ఏఎన్ఎం, మహిళా పోలీసు, ఆశా, ఏడబ్ల్యూడబ్ల్యూ, వీఏవోలకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా ఆయా సచివాలయాల పరిధి, గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆర్పీలు, తదితరులను భాగస్వాములను చేశారు. వీరు ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ, జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తారు.

ఆత్మస్థైర్యం నింపేలా...

కౌమార బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా.. వారిపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేలా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. బాల్య వివాహాలకు అడ్డుకట్ట, లింగ సమానత్వం పెంపొందించేందుకు దోహదపడుతుంది.

- వి.అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్

గ్రామస్థాయిలో కమిటీలు

'కిశోర వికాసం' నిర్వహణకు గ్రామ వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా 5 నుంచి 20 మంది కమిటీ సభ్యులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. అంగన్ వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తారు. వసతులను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నారు. తమ నివాస ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా, లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించిన వెంటనే గ్రూపు సభ్యులు అధికారులకు సమాచారం అందిస్తారు. వెంటనే అడ్డుకట్ట చర్యలు తీసుకుంటారు.

కార్యక్రమాల అమలు ఇలా ...

ఈనెల 6న రుతుక్రమం-శుభ్రత, లైంగిక విద్య 9న బాల్య వివాహాలు, ఆరోగ్యం-ప్రభావాలు 13న పిల్లల హక్కులు, లైంగికవేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన 16న కౌమారంలో రక్తహీనత కలుగకుండా జాగ్రత్తలు 20న లింగవివక్ష, అసమానతలు, ఆడపిల్లపై వివక్ష 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, భవిష్యత్తు మార్గదర్శకం 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ జూన్ 3న బాలి కల నాయకత్వ లక్షణాలు, సాధికారకత 6న క్రీడలు, యోగా, వ్యాయమం 10న బాల్యవివాహల సమస్యలు- నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సైన్యానికి సంఘీభావంగా విజయోత్సవ ర్యాలీ



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్ 9, (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను మట్టుపెడుతున్న భారత సైన్యానికి మద్దతుగా విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి వసంతపేట, గాంధీరోడ్డు, టీబీ రోడ్డు, రాజీవ్ సర్కిల్ మీదుగా శివాలయం సెంటర్ వరకు విజ యోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు నాగార్జునరావు, మల్లికార్జునరావులు మాట్లాడుతూ ఉగ్రవాదులతోపా పాకిస్థాన్ సైన్యంపై భారత్ సైన్యం సాధించిన విజయానికి సంఘీభావంగా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ పీ నాయకులు నాగమునిరెడ్డి, చలపతి, మార్కం డేయ, మురళి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర రావు, భాస్కర్ రెడ్డి, రమణయ్య, నరేష్‌కుమా ర్, దస్తగిరి, రవితేజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ



వినతి పత్రాలు తీసుకుని మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి

జమ్మలమడుగు మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిస్కారవేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. నియోజకవర్గ పరిధిలోని నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పలు సమస్యలతో శుక్రవారం టీడీపీ కార్యాలయంలో అర్జీలు అందజేశారు. నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాలల్లో ఏమాత్రం సమస్యలు పరిస్కారం కావడం లేదని రెవెన్యూ సమస్యలపై పట్టించుకోకుండా ప్రజలను తిప్పుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఆయా సమస్యలపై భూపేష్‌రెడ్డి సంబంధిత అదికారులతో మాట్లాడుతూ ప్రజలను తిప్పుకోకుండా వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నతోట శీను పాల్గొన్నారు.

జిన్నా రోడ్డు పేరును మార్చాలి

ప్రొద్దుటూరు టౌన్ మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిన్నా రోడ్డు పేరు మార్చాలని రాయలసీమ పరిరక్షణ సంఘం జిల్లా కన్వీనర్ ఎం ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పాకిస్థాన్ జాతిపిత మహమ్మద్ ఆలీ జిన్నా కు ప్రొద్దుటూరు పట్టణానికి ఎటువంటి సంబంధం లేదని జిన్నా రోడ్డును గతంలో జబ్బర్ షెడ్ రోడ్‌గా పిలిచేవారని పెర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రగుంట్ల, మే9(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మెంటెనెన్స్ ఉన్నందున శనివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లిరోడ్డు, రానివనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఏరియాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఖాజీపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నముక్కపల్లె కోళ్లఫారం వద్ద గంజాయి అమ్మడంతో పాటు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేయగా చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఖాజీపేట సీఐ మోహన్ అన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి 2 కేజీల 750 గ్రాములు గంజాయి, రూ.20,500 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో మరో ముగ్గురు పరారయ్యారని వారి కోసం గాలింపు చేపడుతున్నా మన్నారు. అరెస్టు చేసిన వారిని మైదుకూరు కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

● ఇళ్లు, ఆలయాలు లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగలు ● హడలిపోతున్న ప్రజలు ● పోలీసులు నిఘా పెంచాలంటున్న వైనం

బి.కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గత సంవత్సరం నుంచి దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇళ్లను, ఆలయాలను లక్ష్యంగా చేసుకుని ఇళ్లలో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని జనం వాపోతున్నారు. మండలంలో ఇప్పటికే చాలా గుళ్లు, ఇళ్లల్లో చోరీలు జరిగాయి. అందులో భాగంగానే గురువారం రాత్రి పాయలకుంట్ల గ్రామంలో ఓబులేసు అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. అలాగే నల్లగొండ నరసింహస్వామి, ఎర్రిఓబన్న బావి ఆంజనేయస్వామి, పల్నాటి అంకాలమ్మ గుడిలో, అభయాంజనేయస్వామి గుడిలో, మున్నెల్లి శివాలయంలో బి.కోడూరు, పాయలకుంట్ల, రామచంద్రాపురం గ్రామాల్లో చోరీలు అధికంగా జరుగుతున్నాయి. దీంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఒక్క పాయలకుంట్ల గ్రామంలోనే బొమ్మన అంకయ్య ఇంటిలో, అలాగే సంగటిపల్లె కొండయ్య ఇంటిలో సరుడు అపహరించారు. అలాగే పాయలకుంట్ల గ్రామానికి చెందిన రాములవారి గుడిలో బంగారు వస్తువులు అపహరించారు. బికోడూరు నడిబొడ్డున ఓ ఇంటిలో మహిళ నిద్రిస్తుండగా మాంగల్య సరుడు అపహరించారు. అయ్యవారిపల్లె గ్రామంలో వినాయకుడి గుడిలో ఇప్పటికే రెండు సార్లు హుండీ చోరీ జరిగింది. ఈ విషయమై అప్పట్లో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇలా రోజూ చోరీలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

పట్టపగలే నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి గుడిలో చోరీ

ఇటీవల కాలంలో బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు ఎర్రిఓబన్న బావి సమీపాన తూర్పుకొండ దడిన వెలసిన పురాతన నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. అప్పట్లో దాదాపుగా 14లక్షల రూపాయల సొమ్ములు అపహరణ జరిగింది. బి.కోడూరు పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న సగిలేటిలో హుండీ పడవేసి బికోడూరు స్టేషనుకే దొంగలు సవాల్ విసిరి వెళ్లారు. అప్పట్లో ఆ దొంగతనం సంచలనం రేపింది. నల్లగొండ నరసింహస్వామి గుడిలో ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున దాదాపుగా 1500 మంది భక్తులు వస్తుంటారు. అలాగే ప్రతి శని, సోమ వారాలు భక్తులు వచ్చి హుండీలో విరివిగా స్వామివారికి కానుకలు వేస్తుంటారు.



గణపతి ఆలయం వద్ద చోరీ విషయమై విచారిస్తున్న పోలీసులు(ఫైల్)

నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పట్టపగలే చోరీ జరిగి ఇన్ని రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు దొంగలను పట్టుకోలేదని ఆలయ ధర్మకర్త లక్ష్మిరెడ్డి తెలిపారు.

పల్నాటి అంకాలమ్మ తల్లి ఆలయంలో..

మండల పరిధిలోని రాజుపాలెం గ్రామ సమీపాన వెలసిన పురాతన పల్నాడు అంకాలమ్మ తల్లి గుడిలో చోరీ జరిగింది. నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశం బద్వేలు- పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు నుంచి మున్నెల్లి-బికోడూరు వెళ్లే రహదారికి ఆనుకుని గుడి ఉంది గుడి చుట్టూ పొలాలు, రైతులు ఎప్పుడూ తిరుగుతుంటారు. ఆ గుడిలో వెల్డింగు మిషన్‌తో వాకిళ్ల తొలగించి దాదాపు రూ.8లక్షలు విలువ చేసే ఆభరణాలు అపహరించారు. అప్పట్లో గ్రామస్థులంతా కలిసి ఫలానా వ్యక్తులు దొంగతనం చేశారని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

నిఘా పెంచి చోరీలను అరికడతాం

మండలంలో జరుగుతున్న వరుస చోరీల విషయమై బి.కోడూరు ఎస్ఐ వెంకటసురేశ్‌ను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, దొంగతనాలపై ఇక మీదట గట్టి నిఘా పెడుతామన్నారు. గుళ్లల్లో, ఇళ్లల్లో చోరీలు జరిగే వారిని పట్టుకుంటామని ఎట్టిపరిస్థితుల్లో వారిని వదలబోమని తెలిపారు.

స్థల విషయమై దాడి

బి.కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని బి.కోడూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొండారామసుబ్బారెడ్డి కుమారుడు కొండా రాజారెడ్డి అతని కుమారులపై వైసీపీ నాయకులు స్థల విషయమై శుక్రవారం దాడికి పాల్పడ్డారు. వివరాలిలావున్నాయి. బి.కోడూరు గ్రామంలోని వడ్ల మిల్లు పక్కన సర్వే నెం.592/2, 592/4 గల ఇంటిస్థలాన్ని రామసుబ్బారెడ్డి అతని కుమారులు రాజారెడ్డి, తమ్ముడు సుబ్బారెడ్డి కలిసి స్థానిక సర్వేయరుతో సర్వే చేయించుకునేందుకు వెళ్లగా, రామసుబ్బారెడ్డి అతని కుమారులపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దుగ్గిరెడ్డి, వెంకటశివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, దుర్గమ్మ కలిసి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్తలైన తండ్రి కొడుకులకు రక్తగాయాలు అయ్యాయి. ఈ విషయమై బి.కోడూరు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేయగా రక్తగాయాలైన టీడీపీ కార్యకర్తలను కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ముద్దనూరు మే09(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు స్కానింగ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ తేజ 32 మంది గర్భవతులకు స్కానింగ్ పరీక్షలు చేశారు. కాన్పు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వివరించారు. పరీక్షలకు వచ్చిన గర్భిణులకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. డాక్టర్లు శ్రీకాంత్,నాగార్జున, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులరెడ్డి , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్. మే 9 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన పెనుశిల లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 12వతేదీ వరకు బద్వేలు ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. శనివారం ఉదయం 8, 8.30, 10గంటలకు, సాయంత్రం 4, 6గంటలకు, ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం సాయంత్రం 5గంటల వరకు పెంచలకోనకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధం ఉత్సవం

జమ్మలమడుగు మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజరత్ సయ్యద్ షా బడే గౌస్‌పీరా ఖాద్రి పెద్ద ఆస్తానముల వారి 93వ ఉరుసులో భాగంగా గంధం ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలో దర్గా పీఠాధిపతి గౌస్‌పీరా ఖాద్రీ భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌన్సిలర్లకు గౌరవవేతనం ఇవ్వకపోవడం దారుణం

● మున్సిపల్ సమావేశంలో సభ్యులతోపాటు వైస్‌చైర్మన్-2 ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చిత్రంలో చైర్‌పర్సన్ శివమ్మ, సమస్యలు తెలుపుతున్న కౌన్సిలర్లు

జమ్మలమడుగు మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు గౌరవం లేదని, గౌరవవేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమని మున్సిపల్ వైస్ చైర్మన్-2 సింగరయ్యతోపాటు పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జమ్మలమడుగు మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఎక్స్ అఫిసియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమావేశానికి హాజరయ్యారకు. ముందుగా 142 అంశాలకు సంబంధించిన అజెండాపై చర్చించారు. వెంటనే కన్నెలూరు కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి గ్రామంలో మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అంబవరం ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులకు బిల్లులు రాక అప్పులు చేసుకుని ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యపై కమిషనర్ స్పందించారు. కాగా మున్సిపాలిటీలో మూడు ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంకులు మంజూరు అయ్యాయని, త్వరలో నిర్మిస్తామని నీటి సమస్య ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో జగనన్న కాలనీ ప్రస్తుతం పేరు మార్చామని ఎన్టీఆర్ కాలనీగా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. టిడ్కో గృహలు మూడు మాసాల్లో అక్కడ ఉన్న సమస్యలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే సమావేశంలో తెలియజేశారు. ముందుగా పహాల్గాంలో మృతిచెందిన బాధి తులకు రెండు నిమిషాలపాటు ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మౌనం పాటించారు.

మహిళలకు చీరలు పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న క్రిష్ణమూర్తి

బ్రహ్మంగారిమఠం, మే 9 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో వెలసియున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు బన్నూరి క్రిష్ణమూర్తి కుటుంబ సభ్యులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నామని అలాగే ఈ సంవత్సరం దాదాపు వెయ్యి మంది మహిళలకు చీరలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సత్యం, సుంకు సిద్ధయ్య, చలమయ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి : పీడీ

దువ్వూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి సూచించారు. మండలంలోని క్రిష్ణంపల్లి, దువ్వూరు, నేలటూరు గ్రామాల్లో ఆయన శుక్రవా రం పర్యటించారు. దువ్వూరులో ఉపా ధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందించాలని అధికారులకు తెలిపారు. నేలటూరు గ్రామంలో ఏర్పా టు చేసిన వర్షపునీటి కుంటను పరిశీలిం చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా పనిచేస్తున్న కూలీల సంఖ్యను 4300 నుంచి 4800లకు పెరిగే విధంగా వారిని ప్రోత్సహించాలని చెప్పారు. వారికి కనీస వేతనం రూ.300 తగ్గకుండా పనిచేయించాలని తెలిపారు. కూలీలు ఎండకు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామక్రిష్ణయ్య, ఈసీ ఇందిరప్రియాంక సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణ కోసమే సమ్మె

బద్వేలు, మే9 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసమే ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు పట్టణంలోని ఎన్‌జీవోహోంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20వ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, యూటీఎఫ్ మండల నాయకులు దేవానందం, మస్తాన్, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు అన్వర్‌బాష యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కొండయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలి



జాకీర్ షరీఫ్
వ్యవసాయాధికారి, కలసపాడు

కలసపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): పంట సాగుచేసే రైతులు భూసార పరీక్షలు తప్పకచేయించాలని మండల వ్యవసాయశాఖాధికారి జాకీర్ షరీఫ్ తెలిపారు. పంటల సాగు, ఎరువులు తదితర విషయాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: భూసార పరీక్ష వల్ల రైతులకు లాభం ఏమిటి?

జవాబు: భూసార పరీక్ష వల్ల ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు లేకుండా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులను పొందవచ్చు. ప్రతి రెండేళ్లకు ఒకసారి రైతు భూసార పరీక్ష చేయించుకుంటే మంచిది.

ప్రశ్న: వేసవి దుక్కుల వలన ప్రయోజనాలు ఏమిటి?

జవాబు: వేసవి దుక్కి వల్ల గత పంట అవశేషాలు తొలగిపోవడం, చీడపీడల నివారణ, వేసవిలో పడిన వర్షపు నీటిని నిల్వ ఉంచే శక్తి పెరుగుతుంది.

ప్రశ్న: పచ్చిరొట్ట ఎరువు వలన లాభాలు ఏమిటి?

జవాబు: పచ్చిరొట్ట ఎరువు లు సేంద్రీయ పదార్థాలను అందించడం, నేలసారవం తం, నీటిని నిలుపుకోవచ్చన్నారు.

ప్రశ్న: ఎంతమంది రైతులకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పూర్తిచేశారు?

జవాబు: మండలంలో ఏపీఎఫ్ఆర్ పోర్టల్ ద్వారా 5627 మంది రైతులను నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు సంఖ్య జనరేట్ చేయడమైంది.

ప్రశ్న: రాయితీ యంత్రాలను రైతులకు అందిస్తున్నారా?

జవాబు: అందిస్తున్నాం. వాటి ద్వారా సులభతర వ్యవసాయం, కూలీల కొరత తగ్గి, వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రొద్దుటూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఆరోగ్యపరంగా కూడా మంచిది కాదని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం- వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహలపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. కిశోరవికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చౌటిపల్లె, ఎస్ తిమ్మాపురం అంగనవాడీ సెంటర్‌లో శుక్రవారం కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిమ్మాపురంలో ఈ సందర్భంగా బాల్యవివాహాలపై ర్యాలీ నిర్వహించారు. మహిళాపోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగనవాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని అంబవరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 15 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ అద్దంకి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా డిప్లమాపాస్ అయి 18సంవత్సరాల పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు నేరుగా పాలిటెక్నిక్ కళాశాల వద్ద సంప్రదించాలని కోరారు.

బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

ప్రొద్దుటూరు , మే 9 (ఆంధ్రజ్యోతి) : పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని బీసీ ప్రజా చైతన్య స మాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయలు, ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గౌడ్ తెలిపారు. శుక్ర వారం వారు మాట్లాడుతూ ప్రథమ బహుమతి 5 వేలు, ద్వితీయ బహుమతి 4వేలు అంద జేస్తామన్నారు. అలాగు పదిలో 520 మార్కులు సాధించిన విద్యార్థులకు 3 వేల వంతున నగదు ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. విద్యార్థులు మే 25 లోపు మార్కుల పత్రాలతో బీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జూన్ 1న బహుమతులు అందజేస్తామన్నారు.

తొగటవీరక్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్ 9, (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు తొగట వీర క్షత్రియ పురస్కారాలు ఇవ్వనున్నట్లు ఆ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు ఇంగ్లీషు మీడియంలల్లో 450కి పైగా మార్కులు సాధించిన తొగట వీరక్షత్రియ విద్యార్థులకు పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్‌లోని అన్ని గ్రూపులల్లో 75శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు జూన్ 1న జరిగే కార్యక్రమం లో ప్రతిభ పురస్కారం అందజేస్తామని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు చౌడయ్య, కోశాధికారి అంజినేయులు, వెంకట సుబ్బయ్య, సూర్యనారాయణ, రామయ్య, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కొత్తవారు కనిపిస్తే సమాచారమివ్వాలి

పోరుమామిళ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులు కానీ, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డిలు సూచించారు. సరి హద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా శుక్రవారం పోరుమామిల్లలోని లాడ్జిలను తనిఖీ చేశారు. కొత్తవారు అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉంటే ఆరా తీశారు.